దళారులదే రాజ్యం

నిలిచిపోయిన ధాన్యం కొనుగోలు

భట్లపెనుమర్రు(మొవ్వ): ప్రస్తుతం ధాన్యం కొనుగోలు సక్రమంగా లేదంటూ మొవ్వ మండలంలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే దళారులు సుమారు క్వింటాల్‌కు రూ.300 తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. వెంటనే నగదు చేతిలో పడుతుంది అనుకున్న రైతులకు సైతం నేడు చుక్క ఎదురవుతోంది.


తేమ శాతం తగ్గించేందుకు ధాన్యం ఆరపెడుతున్న మహిళా రైతులు

రేయనక.. పగలనక కష్టపడి పంట పండించిన రైతు సొమ్ము దళారుల పాలవుతోంది. గ్రామాల్లో స్థానికంగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందాల్సిన సంచుల కొరత ఏర్పడింది. రవాణా చేసేందుకు కావాల్సిన లారీలు సకాలంలో రావడం లేదు. దీంతో పొలాల్లో, రోడ్ల మీద, ఖాళీ స్థలాల్లో ధాన్యాన్ని పెట్టుకుని రైతులు పడిగాపులు కాస్తున్నారు.

భట్లపెనుమర్రులో పరిస్థితి దారుణం

మొవ్వ మండలం భట్లపెనుమర్రులో ఈ నెల 19వ తేదీ నుంచి గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రారంభించగా 12 వందల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లర్లకు తరలించారు. పంట చేతికి రావటంతో మిషన్ ద్వారా కోతలను వేగవంతం చేశారు. గ్రామంలో సుమారు అధికారుల లెక్కల ప్రకారం రెండు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉంది. అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటు చేసుకోవటం, అవసరమైన సంచులు అందించక పోవటంతో రైతులు పడుతున్న ఆవేదన వర్ణణా తీతంగా మారింది. 10 రోజుల నుంచి రైతులు విస్తృతంగా ధాన్యం సరఫరా చేయటంతో తాత్కాలికంగా ధాన్యం కొనుగోలు నిలిపివేశారు. ధాన్యం తరలించేందుకు లారీలు కూడా లేవని అధికారులు చెబుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.

దళారులు చెప్పిన వారికే సంచులు

ధాన్యం కొనుగోలులో దళారీ వ్యవస్థ గ్రామాల్లో రాజ్య మేలుతోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంచులు రాకుండా.. దళారులు చెప్పిన వారికే నేరుగా సంచులు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా కంటే మధ్యవర్తుల ద్వారానే అధిక మొత్తంలో మిల్లర్లకు ధాన్యం తరలి వెళుతుందనే విమర్శలున్నాయి. యంత్రాల ద్వారా కోసిన ధాన్యంలో తేమ తగ్గేందుకు రైతులు పడుతున్న కష్టం వర్ణణాతీతం. ధాన్యాన్ని పట్టాలపై ఆరబెట్టి పంపినా తేమ ఎక్కువగా ఉందని తిరిగి పంపటం పరిపాటిగా మారింది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మిల్లర్లతో చర్చించి, తాత్కాలికంగా నిలిచిన విక్రయాలను కొనసాగించే ఏర్పాటు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.


అయ్యంకిలో రెడ్డుపై ధాన్యం బస్తాలు

ఎక్కడి ధాన్యం అక్కడే ఉంది



గ్రామంలో ఎక్కడి ధాన్యం అక్కడే ఉంది. ధాన్యంలో తేమ శాతం తగ్గించేందుకు కష్ట పడాల్సి వస్తోంది. ధాన్యాన్ని సంచులపై మూడు రోజులుగా ఆరబెట్టాం. కింది ధాన్యం ఆరాలని గంట రెండు గంటలకు ఓ సారి కూలీల సాయంతో తిప్పుకుంటున్నాం.
– ఆరేపల్లి మాతమ్మ, మహిళా రైతు

ధాన్యం వద్దే పడిగాపులు



నేను భట్లపెనుమర్రులో ఆరు ఎకరాలు పొలాన్ని కౌలుకు చేస్తున్నా. వారం కిందట యంత్రాల ద్వారా ధాన్యం నూర్పాను. ధాన్యం కాటా కూడా పూర్తి చేశా. సంచుల కోసం ఐదు సార్లు రైతు భరోసా కేంద్రానికి వెళ్లా. సంచులు లేవని, లారీలు మీరు మాట్లాడుకోవాలని అధికారులు చెబుతున్నారు. దీంతో వారం నుంచి ధాన్యం వద్దే పడిగాపులు కాస్తున్నా.
– మొవ్వ చింతయ్య, కౌలు రైతు

సంచులు లేవు



నేను భట్లపెనుమర్రులో మూడు ఎకరాల్లో 1061 ధాన్యాన్ని సాగుచేశా. యంత్రాల ద్వారా నూర్చా. ధాన్యం తరలించాలంటే సంచులు లేవు. లారీలు కూడా లేవు అని అధికారులు చెబుతున్నారు. రైతులే మిల్లర్లతో మాట్లాడుకుంటే బిల్లులు చేస్తాం అంటున్నారు.
– బొల్లా ఏడుకొండలు

15 వేల సంచులను అందజేశాం

మిల్లర్లు అందించిన 15 వేల సంచులను రైతులకు అందజేశాం. తేమ శాతం 26–30 శాతం వరకు ఉంటుంది. నిబంధనల ప్రకారం 17 శాతం వరకు ఉన్నా కొంత మేర మద్దతు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.
– జున్ను రాజేష్, టెక్నికల్ అసిస్టెంట్, భట్లపెనుమర్రు

27,779 క్వింటాళ్లు కొనుగోలు చేశాం

మొవ్వ మండల పరిధిలో 27,779 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. తేమ శాతం 27 నుంచి 29 శాతం వరకు ఉండటంతో మొక్క మొలిచే అవకాశం ఉంటుందని మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యంత్రాలపై కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావాలని రైతులకు సూచించాం. కొనుగోలు చేసే ధాన్యానికి 17 శాతం తేమ ఉండాలని పేర్కొన్నాం.
– కె.మస్తాన్, తహసీల్దార్, మొవ్వ

క్లుప్తంగా

ఘనంగా కార్తిక వన సమారాధన



పామర్రు: బ్రాహ్మణ కార్తిక వన సమారాధన బుధవారం ఘనంగా నిర్వహించారు. పమిడిముక్కల మండలం తాడంకి గ్రామంలో రొంపిచర్లలో కాంత రంగ ప్రసాద్, హేమలత , శ్రీనివాసాచార్యులు, సుధ దంపతుల ఆధ్వర్యంలో స్థానిక ఉసిరి చెట్టు వద్ద కార్తిక దామోదర స్వామి పూజలు నిర్వహించారు. అర్చకులు అంజిబాబు పూజలను చేయించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

పల్లిపాలెంలో..

కైకలూరు: కొండంగి పల్లిపాలెంలో బుధవారం కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. తొలుతగా ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. గ్రామ పెద్దలు సొర్రా లీలాకుమార్, కొల్లాటి సుబ్బారావు, తిరుమలశెట్టి బాపూజీ, తిరుమల స్వామి, పోతురాజు, రేవు నాగబాబు, సర్పంచ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గురజలో..

ముదినేపల్లి రూరల్ : కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా నిలిచేందుకు సమారాధనలు దోహదపడతాయని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. గురజ గంగాపార్వతీస మేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన కార్తిక వనసమారాధనలో ఆయన పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి



పామర్రు(తోట్లవల్లూరు): ఆధ్యాత్మిక భావనను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. తోట్లవల్లూరు మండలం రొయ్యూరులో నిర్వహించిన కోటి దీపోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుధవారం పాల్గొన్నారు. దీపాలను వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు వి.శివరాం, ప్రధాన కార్యదర్శి రేణుకరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని టూటౌన్ ఎస్‌ఐ జాస్మిన్ పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రహదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు



గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారుల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అధికారులను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో బుధవారం నేషనల్ హైవే అధికారులు, ఆర్టీఓ బాలసుబ్రహ్మణ్యంతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి తీసుకోనున్న చర్యలను నేషనల్ హైవే డీఈ సత్యనారాయణ ఎమ్మెల్యే రాముకు వివరించారు. సమావేశంలో ఎయిర్‌పోర్ట్ కమిటీ సభ్యుడు కామేపల్లి తులసీబాబు, ఏఈ శరత్‌చంద్ర పాల్గొన్నారు.

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి



కైకలూరు: తుపాను హెచ్చరిక నేపథ్యంలో ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు రైతులకు సూచించారు. కైకలూరు మండలం రాచపట్నం, తామరకొల్లు, వేమవరప్పాడు, వింజరం గ్రామాల్లో సబ్‌డివిజన్ ఏడీఏ గంగాధరరావు, ఏఓ ఆర్.దివ్య, తహసీల్దార్ ఇబ్రహీం బుధవారం వరి పొలాలను, ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాబోయే రెండు, మూడు రోజులు రైతులు వరి కోతలు నిలుపుదల చేయాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికట్టండి

గుడివాడ టౌన్: బాల్య వివాహాలను అరికట్టే విషయంలో ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక కోర్టు భవనంలో మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ మంగళవారం న్యాయవాదులతో ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ సాధ్యమైనంత వరకు అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. వీటికి సంబంధించి ఎటువంటి సంఘటనలు గుర్తించినా వెంటనే గ్రామ పంచాయతీకి గాని, ప్రభుత్వ అధికారులకు గాని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి, జూనియర్ సివిల్ జడ్జి పి.గాయత్రి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

మండవల్లి: బాల్య వివాహాలను అరికట్టాలని లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి అన్నారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ ఆదేశాల మేరకు బుధవారం బాల్య వివాహాల వ్యతిరేక చట్టాలపై అవగాహన సదస్సు స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్యానల్ లాయర్లు పవన్‌కాంత్, ప్రసన్నకుమార్, శివప్రసాద్, సూపర్‌వైజర్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత దేశంగా తీర్చిదిద్దాలి

మొవ్వ: బాల్య వివాహ రహిత దేశంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని మొవ్వ న్యాయమూర్తి పీ రాజన్‌ఉదయ్‌ప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక మండవ కనకయ్య జెడ్పీ హైస్కూల్లో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాలు వినియోగంతో కలిగే నష్టాలు, మైనర్ల కోసం ఏర్పాటు చేసిన చట్టాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీదేవి, న్యాయవాదులు శ్రీనివాసరావు, సరస్వతి, చిన్నారావు, వెంకటశ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం


మండవల్లిలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మి


మొవ్వలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజన్‌ఉదయ్ ప్రకాష్

మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి

కూచిపూడి(మొవ్వ): కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో భాగంగా అర్హులైన వారికి ఒక్కొక్కరికి మూడు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల సాధన కోసం సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం మొవ్వ మండలం కూచిపూడిలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద గ్రేడ్ వన్ కార్యదర్శి కే పుష్పనాథానికి దరఖాస్తులు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నివేశన స్థలాల్లో ఇల్లు కట్టుకోలేని పేదలకు ఎన్నికల హామీల్లో కూటమి నాయకులు చెప్పిన విధంగా రూ.5 లక్షలను ఇచ్చి చేయూతనివ్వాలన్నారు. కార్యక్రమంలో మహిళలతో పాటు కృష్ణా జిల్లా సీపీఐ సమితి కార్యదర్శి టీ తాతయ్య, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాదబాబు తదితరులు పాల్గొన్నారు.


కూచిపూడి సచివాలయం వద్ద దరఖాస్తులను అందజేస్తున్న మహిళలు, నాయకులు

ప్రత్యేక పూజలు

కైకలూరు: కలిదిండి మండలం కోరుకొల్లు కేదారేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పాల్గొన్నారు. తొలుత ఆయన ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు దూలం శ్యాంకుమార్, నాయకులు చెన్నంశెట్టి సోమేశ్వరరావు, చెన్నంశెట్టి మాతరావు, తలారీ వీరుళ్లు, గంగుల పాండురంగారావు, చెన్నంశెట్టి రవితేజ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లిలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు బుధవారం కార్తిక మాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లింగాల విశ్వేశ్వరుడి ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు.


కేదారేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

పశు వైద్యశిబిరం పరిశీలన

మండవల్లి: నాణ్యమైన పాల దిగుబడితో అధిక ఆదాయం పొందవచ్చని, పాడి రైతులు పశువులకు పోషణతో కూడిన ఆహారం అందించడంపై దృష్టి సారించాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. పెరికెగూడెంలో బుధవారం గన్నవరం పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో పశువుల్లో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ సందర్శించి అనంతరం పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పశుగణాభివృద్ధి సంస్థ గన్నవరం ఉపసంచాలకులు డాక్టర్ శ్రీనివాసారావు హాజరై పశువులకు అవసరమైన రూ. 20వేలు ఖరీదైన మందులు ఉచితంగా అందజేశారు. శిబిరంలో డాక్టర్ గంగవరపు రామకృష్ణ, డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ డీవీ వరప్రసాద్ పాల్గొని వైద్య సేవలు అందజేశారు.

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

చినముత్తవి(మొవ్వ): మొవ్వ మండలంలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం సేకరణ చాలా తక్కువ స్థాయిలో జరుగుతుందన్నారు. అధికారులు చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోయిందన్నారు. రైతు నూర్పిడి చేసిన ప్రతి ధాన్యం గింజ నష్టపోకుండా యుద్ధ ప్రతిపాదికన లారీలను పంపి రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లను అధికారులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో క్రీడాకారుడి ప్రతిభ

గుడివాడ టౌన్: దక్షిణ భారత పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తమ క్రీడాకారుడు బంగారు పతకం సాధించడంతో పాటు స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ సౌత్ ఇండియాగా ఎంపిక వడం అభినందనీయం అని ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్టేడియం కార్యాలయంలో పవర్ లిఫ్టర్ పెద్ది జాన్ బాబును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం సేలంలో జరిగిన దక్షిణ భారత పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పెద్ది జాన్‌బాబు బంగారు పతకం సాధించడంతో పాటు స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ సౌత్ ఇండియాగా గుర్తింపు పొందారన్నారు. ప్రతిభను ప్రదర్శించిన జాన్‌బాబును, కోచ్ వెంకటేశ్వరరావును స్టేడియం సంయుక్త కార్యదర్శి కె.రంగప్రసాద్, పాలకమండలి సభ్యులు అభినందించారు.


జాన్‌బాబును అభినందిస్తున్న స్టేడియం కమిటీ సభ్యులు

సంక్షిప్త వార్తలు

గురజాడ స్ఫూర్తిని మరువలేం

గుడ్లవల్లేరు: దేశాన్ని ప్రేమించమన్న గురజాడ అప్పారావు ఇచ్చిన స్ఫూర్తిని తెలుగు ప్రజలు ఎన్నటికీ మరువలేరని సీపీఎం మండల నాయకుడు బి.వి.శ్రీనివాసరరావు అన్నారు. గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు ఎం.జయలక్ష్మి, సెక్టార్ లీడర్లు అమ్మాజీ, మౌనిక గ్రేస్, రజని, ధనలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మండవల్లి: అప్పాపురంలో సీసీ రోడ్డు పనులు బుధవారం సర్పంచ్ బుర్ల భోగేశ్వరరావు ప్రారంభించారు. రూ.11 లక్షల ఎన్‌ఆర్‌జీఈఎస్ నిధులతో కర్రేటి పోతురాజు ఇంటి నుంచి పంట బోదె వరకు 150 మీటర్ల పొడవున సీసీ రోడ్డును నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గుడివాడరూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ అనంతలక్ష్మి అన్నారు. మండలంలోని రామనపూడి, బిళ్లపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ కోతలు కోసి కళ్లంలో ఉన్న ధాన్యాన్ని రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. ఏఈఓ డి.అనూష, వీపీఏలు శ్రీకాంత్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు

గుడ్లవల్లేరు: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల రీత్యా తేమ శాతంతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయనున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ బి.లోకరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లపై ధాన్యం ఆరబెట్టిన రైతులు కంగారు పడనవసరం లేదన్నారు. ధాన్యం కొనుగోళ్లకు వాహన సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బంది లేకుండా చర్యలు

పమిడిముక్కల: తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, రవాణాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నామని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మండలంలోని కపిలేశ్వరపురం గ్రామంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం రాశులను ఎమ్మెల్యే పరిశీలించారు. పంట అమ్మకంలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. రైతుల సమస్యలపై తాను మిల్లర్లు, అధికారులతో మాట్లాడానని తెలిపారు. ఇకపై రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు పిరమిడ్ ధ్యానకేంద్ర వార్షికోత్సవం

గుడివాడ టౌన్: శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు రాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తట్టివర్రు రోడ్‌లోని శ్రీ రమణ మహర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రం నందు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ కార్యక్రమాలతో పాటు కార్తిక వనసమారాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

30న పింఛన్ల పంపిణీ

పమిడిముక్కల: డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందు అంటే ఈ నెల 30వ తేదీన వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళలు తదితర పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కైకలూరు: వినియోగదారులు విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎం.విక్టర్ ఇమ్మానియేలు అన్నారు. స్థానిక సీతారామ ఫంక్షను హాల్లో విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమ్మానియేలు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై నమోదైన ఫిర్యాదుల పరిష్కారానికి అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సదస్సులో మచిలీపట్నం సర్కిల్ ఎస్ఈ ఎం.సత్యానందం, గుడివాడ ఈఈ జేబీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కల్యాణమస్తు పథకంతో రైతులకు మేలు

కొండిపర్రు(పామర్రు): కల్యాణమస్తు పథకంతో పాడి రైతులకు మేలు కలుగుతుందని విజయవాడ కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్టు బోర్డు జిల్లా డైరెక్టర్ బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. పామర్రు మండలం కొండిపర్రులోని పాల ఉత్పత్తిదారుడు అల్లాడ రామకృష్ణ కుమార్తె ఆకాంక్ష వివాహం సందర్భంగా బుధవారం పథకం ద్వారా బంగారు నాణేన్ని అందజేశారు. పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపిచంద్, పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు

గుడివాడరూరల్: రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు అన్నారు. మండలంలోని చిరిచింతల గ్రామంలో వరికోతలు, నూర్పిళ్లు చేసి ఆరబెట్టిన ధాన్యాన్ని బుధవారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పరంగా రైతులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఏఓ అనంతలక్ష్మి, పీడీఎస్ డీటీ కిరణ్, ఆర్‌ఐ నాగబాబు పాల్గొన్నారు.

రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు

ముదినేపల్లి రూరల్: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలో జేసీ పర్యటించి వడాలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ ధాన్యం పట్టుబడికి, రవాణాకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తహసీల్దార్ జేఎస్ సుభాని, మండవల్లి సబ్‌డివిజన్ ఏడీఏ వెంకటమణి, ఏఓ వేణుమాధవ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో రాజ్యాంగ పీఠిక ప్రదర్శించాలి

మండవల్లి: మండలంలోని అన్ని పాఠశాలల్లో రాజ్యాంగ పీఠికను ప్రదర్శించి, విద్యార్థులతో చదివించాలని హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేసినట్టు ఎంఈఓ ఎస్ రత్నసునానందం తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీ నుంచి వారం రోజులు పాఠశాలల్లో రాజ్యాంగ పీఠికను విద్యార్థులతో చదివించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ నెల 18న ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎస్ భాస్కరరావు ఎంఈఓకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎంఈఓ బుధవారం అర్జీదారుడు భాస్కరరావుకు విద్యాశాఖ ద్వారా తీసుకున్న చర్యలను వివరించారు.

విద్యార్థులకు అవగాహన

నందివాడ: మండలంలోని కుదరవల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బాలలపై జరిగే నేరాలు, రహదారి భద్రత, మాదక ద్రవ్యాలతో జరిగే నష్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందన్నారు. బాలికలపై ఏవైనా బ్యాడ్ టచ్ సంఘటనలు ఎదురైనపుడు ఎలా స్పందించాలనే విషయాలపై వివరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన శక్తి టీం సభ్యులు నందివాడ మండలంలో సేవలు అందిస్తారని తెలిపారు.

రేపు లక్ష మారేడు దళ బిల్వార్చన

పామర్రు: స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 29వ తేదీన లక్ష మారేడు దళ బిల్వార్చన నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సేవా సమితి కార్య నిర్వాహక సభ్యులు ఫణికిషోర్ శర్మ బుధవారం తెలిపారు. అనంతరం స్థానిక పాతాళేశ్వరమ్మ ఆలయ సమీపంలోని పాత పోస్టాఫీసు వీధిలో చావలి వెంకటేశ్వరరావు గృహం నందు కార్తిక భోజన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.